

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త


## జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 19, ప్రభాతవార్త** చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పర్వదినమైన దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం దీపావళి సందర్భంగా జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పర్వదినం సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం చంద్రబాబునాయుడుకి, కూటమి ప్రభుత్వానికి లక్ష్మీదేవి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని అన్నారు. ఈ పండుగ మన జీవితాల్లో విజయానికి, ఉల్లాసానికి, ఉత్తేజానికి ప్రతీక, చీకటి మీద వెలుగు చెలరేగే సంకేతంగా, అనేక కొత్త ఆశలతో, ఆయురారోగ్యంతో, ఆనందంతో, ప్రతి ఇంటిలో ఎల్లప్పుడూ సిరిసంపదలు నెలకొనాలని అన్నారు. అష్టలక్ష్ములు ప్రతి ఇంట్లో నెలవై, అందరికి విజయాన్ని, ధైర్యాన్ని, స్థైర్యాన్ని, సంతోషాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ వేడుక నేపథ్యంలో పర్యావరణ హితంగా అప్రమత్తతతో సురక్షితంగా టపాసులు కాల్చడం మన బాధ్యత అని, చిన్నారులు, వృద్ధులు, మహిళలు అందరూ ఆనందంగా కలిసికట్టుగా దీపావళి జరుపుకోవాలని కోరారు.

## దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారాయణ

- సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో దీపావళి విజయానికి ప్రతీక
- కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల కష్టాలను తరిమేయాలని మనస్పూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడి



**నెల్లూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** జిల్లా, రాష్ట్ర ప్రజలందరికి రాష్ట్ర పురపాలకపట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఈ దీపావళి విజయానికి ప్రతీక అని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజలందరికి జీవితాల్లో కష్టాల చీకట్లు తలగిపోయి సంతోషాల వెలుగులు ప్రసరించాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. టపాసుల వెలుగులతో దీప కాంతుల జ్యోతులతో సిరిసంపద రాసులతో ఈ దీపావళి ప్రతి ఇంట సిరుల పంట కురిపించాలని కోరుకుంటున్నానన్నారు. కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల కష్టాలను తరిమేయాలని మనస్పూర్తిగా ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. ప్రజల చీకట్లను చెరిపేసే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లని పారద్రోలినట్లుగా ఒక్కొక్క మార్పు సాధించుకుంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకుందామని సూచించారు. అష్టలక్ష్ములు ప్రతి ఇంట్లో నెలపై సకల శుభాలను, ధైర్యాన్ని, స్థైర్యాన్ని, విజయాలను సిరిసంపదలను, సుఖసంతోషాలను ప్రసాదించాలని, తెలుగింటి లోగిళ్ళన్నీ దీప కాంతులతో వెలుగులీనాలని, ఈ దీపావళి మీ జీవితంలో వెలుగులు నింపాలని, సరికొత్త వెలుగులతో ప్రజల జీవితాలు మరింత ప్రకాశించాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.

## దీపావళి శుభాకాంక్షలు తెలిపిన

జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** ప్రజలందరికీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలందరూ ఈ దీపావళి పండుగను సంతోషకరంగా జరుపుకోవాలని, సరికొత్త వెలుగులతో ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలతో సంతోషకర జీవితం గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై ఆ లక్ష్మీదేవీ కరుణాకటాక్షాలు మెండుగా వుండి రాష్ట్రం ప్రకాశవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ బాణాసంచా కాల్చేటప్పుడు చాలా అప్రమత్తంగా వుండాలని, పర్యావరణానికి హాని జరగకుండా, దీపాలకాంతులతో ఆనందకర దీపావళి జరుపుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో సంతోషాల వెలుగులు నింపాలి

- రాష్ట్ర ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఆనం



**నెల్లూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్ర ప్రజలందరికి ఈ దీపావళి పర్వదినం సంతోషాల సంబరం కావాలని, అందరి జీవితాల్లో కాంతులు వెల్లివిరియాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. దీపావళి పండుగ సందర్భంగా మంత్రి ఆనం ప్రజానీకానికి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీక అయిన దీపావళి పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఐకమత్యం, సౌభాగ్యం నింపాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రం మరోసారి వెలుగులదివ్వెలా ప్రకాశించడానికి సీఎం నారా చంద్రబాబునాయుడు దూరదృష్టి, కూటమి ప్రభుత్వ కృషి పునాది అవుతుందని మంత్రి ఆనం అన్నారు. ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. పెద్దపెద్ద శబ్దాలు చేసే బాణసంచా కాకుండా వెలుగుపువ్వుల పర్యావరణహిత దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

## జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు...
## తెలిపిన కలెక్టర్ హిమాన్షు శుక్ల

- తల్లిదండ్రుల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలి
- పర్యావరణహిత దీపావళి జరుపుకోవాలని సూచన



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త** జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ హిమాన్షు శుక్ల దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి అంటే వెలుగుల పండుగ అని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ బాణాసంచాను కాల్చుకోవాలని సూచించారు. పర్యావరణహితం కోసం పెద్దపెద్ద శబ్దాలు, కాలుష్యం వెదజల్లే టపాసులు కాకుండా వెలుగుదివ్వెలు విరజిమ్మే టపాసులు కాల్చాలన్నారు. తల్లిదండ్రులు, పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంధకారంపై వెలుగు సాధించిన పండుగ దీపావళి స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఈ దీపావళి పర్వదినాన్ని జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## దీపావళి శుభాకాంక్షలు తెలిపిన
## జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త** జిల్లా ప్రజలకు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలు, వెలుగుదివ్వెల కాంతులతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని జేసీ ఆకాంక్షించారు.

## సంగం కొండ వద్ద జాతీయ రహదారిపై

విరిగిపడిన కొండ చరియలు



**సంగం అక్టోబర్ 19 ప్రభాతవార్త** సంగంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండ వద్ద జాతీయ రహదారిపై కొండ చరియలు విరిగి పడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే ఎస్ఐ రాజేష్ అర్ధరాత్రి తన సిబ్బందితో రహదారిపై న పడి వున్న కొండ చర్యలను తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు. వాహనదారులు కొండ వద్ద ఉన్న జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. వర్షాల సమయంలో కొండపై ఉన్న రాళ్ళు ఇంకా విరిగి పడే అవకాశం ఉన్నందున రాత్రి సమయంలో ప్రయాణం చేసే సమయంలో జాగ్రత్తగా వెళ్లాలని అన్నారు.

### వర్షాకాలం వస్తే సంగం కొండ వద్ద హడల్

వర్షాకాలం వస్తే సంగం కొండ వద్ద జాతీయ రహదా రిపైన వెళ్ళే వాహనదారులు హడలిపోతున్నారు. ఎక్కడ కొండ రాళ్ళు వాహనాలపైన పడుతాయోనని భయాం దోళనకు గురౌతున్నారు. హైవే అధికారులు స్పందించి కొండరాళ్ళు పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబరు 19, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 15827 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 73.940టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం100.027మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## భారీ వర్షాల హెచ్చరిక జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

- ❖ మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్ళరాదు
- ❖ సముద్రంలో ఉన్న మత్స్యకారులు తప్పనిసరిగా అక్టోబర్ 21 లోపు తీరానికి చేరుకోవాలి
- ❖ తీర ప్రాంత గ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ❖ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త** ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని, దీని ప్రభావంతో మంగళవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున జిల్లాలోని ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ అల్పపీడనం 48 గంటల్లో పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతం, పశ్చిమమధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో బుధవారం నుంచి జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు భారీ వర్షాల ప్రభావం అధికంగా ఉంటుందని, ఈ ప్రభావంతో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

❖ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదు. అక్టోబర్ 21వ తేదీ మధ్యాహ్నం నుండి దక్షిణ మధ్య బంగాళాఖాతంలోకి సముద్రయాత్రలు చేయరాదని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ అయినట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడదని, సముద్రంలో ఉన్న మత్స్యకారులు తప్పనిసరిగా అక్టోబర్ 21 లోపు తీరానికి చేరుకోవాలన్నారు. వాతావరణ శాఖ సూచన మేరకు అక్టోబరు 22, 23 అక్టోబర్ తేదీల్లో సముద్రయాత్రలు చేయరాదని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసేప్పుడు ప్రజలు చెట్ల క్రింద నిలబడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గాలి వేగం గంటకు 45-65 కిమీ వరకు ఉండవచ్చన్నారు. తీర ప్రాంత గ్రామాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని కలెక్టర్ చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, జిల్లా అధికారుల సూచనలను పాటించాలని కలెక్టర్ సూచించారు.

## హత్యాయత్నం కేసులో ముద్దాయిలు అరెస్ట్



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** తన స్నేహితురాలు మరొక వ్యక్తికి భార్య అయినప్పటికీ ఆమెతో చనువుగా ఉండడం, ఈ విషయం తెలిసి సదరు మహిళ భర్త నిలదీయడంతో హత్యాయత్నానికి ఒడిగట్టాడు. ఈ ఘటనలో నిందితులను వేదయపాలెం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వీరేపల్లి కిషోర్ నాయుడు, తన భార్య అనూషతో కలిసి స్థానిక త్యాగరాజ నగర్‌లో కాపురం ఉంటున్నారు. అనూషకు తన చిన్ననాటి స్నేహితుడు సైదాపురానికి చెందిన పాకనాటి రోహిత్ రెడ్డితో పరిచయం ఉంది. ఇప్పటికీ ఆమెతో సన్నిహితంగా మెలగాలని భావిస్తూ ఉన్నాడు. ఈ విషయం కిషోర్ కు తెలియడంతో అతను, అతని తండ్రి శేషాద్రితో కలిసి రోహిత్ రెడ్డిని మందలించాడు. ఈ విషయం మనసులో పెట్టుకున్న రోహిత్ రెడ్డి తనకు వారిద్దరి వలన ఎప్పటికైనా ఇబ్బంది ఉందని భావించి తానే కిషోర్ కుమార్ అడ్డు తొలగించుకోవాలని భావించాడు. ఈ క్రమంలో 17వ తేదీ అర్ధరాత్రి కిషోర్ కుమార్ ఇంటికి తన స్నేహితులైన వేదయపాలెం ప్రాంతానికి చెందిన కీర్తి భరత్, కొమ్ముల కార్తీక్‌లతో కలిసి వెళ్లి కాలింగ్ బెల్ కొట్టాడు. బయటకు వచ్చిన కిషోర్ కుమార్ పై ముగ్గురు దాడి చేసి, పగిలిన బీరు బాటిలపగిలిన బీరు బాటిల్‌తో గొంతులో పొడిచారు. కిషోర్ భార్య ఈ సంఘటనను గమనించి కేకలు వేసి చుట్టుపక్కల వారి సహాయంతో కిషోర్ కుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా నిందితులు ముగ్గురిని ఆదివారం వేదయపా లెం సిఐ కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. నిందితులు దాడి చేసేందుకు వచ్చిన ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు లో ప్రతిభ కనబరిచిన సీఐ కే.శ్రీనివాసరావు, ఎస్సైలు ముత్యాలరావు, నవీన్ కుమార్, సిబ్బంది తురక శ్రీనివాసులు, జిలాని, గురు మహేష్, కిషోర్, వెంకటరమణ లను ఎస్పీ అజిత వేజెండ్ల, నగర డిఎస్పి సింధు ప్రియలు అభినందించారు.

## లక్ష్మీనాయుడు హత్యకు కేవలం ఆర్ధిక లావాదేవీలే కారణం

- హోంమంత్రి వంగలపూడి అనిత
- గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామం లో హత్యగావించబడ్డ తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రులు అనిత, నారాయణ
- ముఖ్యమంత్రి ఆదేశాలతో భాదిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పి, అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా
- భాదితురాలిని, ఆమె కుటుంబాన్ని ఆదుకునే విషయమై ముఖ్యమంత్రి కి సమగ్ర నివేదిక అందజేస్తామని ప్రకటించిన మంత్రులు



**కందుకూరు, అక్టోబర్ 19 ప్రభాతవార్త :** గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్యోదంతం పై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని రాష్ట్ర హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత తెలిపారు. అక్టోబర్ 2 న హత్య జరిగిన జిల్లాలోని గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామంలో భాదిత కుటుంబాన్ని ఆదివారం మంత్రులు అనిత, నారాయణ పరామర్శించారు. లక్ష్మీ నాయుడు భార్య సుజాత ను, అతని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి, అన్నివిధాలా ఆదుకుంటామని ప్రకటించడమే కాకుండా నేరుగా అక్కడి నుండే బాధితురాలితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో మాట్లాడించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత, మున్సిపల్ వ్యవహారాల మంత్రి నారాయణ తో కలసి మీడియాతో మాట్లాడుతూ లక్ష్మీ నాయుడు హత్య దురదృష్టకర సంఘటనయని, ఆర్థిక లావాదేవీలే కారణమని ప్రాథమిక విచారణలో తేలిందని, హత్య చేసిన నిందితులు, అందుకు ప్రేరేపించిన వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి కఠినంగా శిక్షిస్తామన్నారు. నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్ కు పంపడం జరిగిందన్నారు. భాదితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అయితే ఆడబిడ్డ ఆవేదన, అతని తల్లిదండ్రుల కడుపు కోతను గమనించి హత్యను రాజకీయం చేయవద్దని అందరికీ నమస్కరించి చెబుతున్నామ న్నారు. క్రిమినల్స్ కు కుల, మతాలు ఉండవని, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. భర్తను కోల్పోయి విషాదంలో ఉన్న సుజాత, వారి పిల్లలను ఆదుకునే విషయమై సమగ్ర నివేదిక తయారుచేసి ముఖ్యమంత్రి కి అందిస్తామన్నారు.

### బాధిత కుటుంబానికి అండగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసులు

తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసులు వ్యక్తిగతంగా బాధిత కుటుంబానికి 2,50,000 ఆర్థిక సహాయాన్ని ప్రకటించి తక్షణం ఆ నగదును మంత్రుల సమక్షంలో బాదిత కుటుంబానికి అందజేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి శుభాకాంక్షలు తెలిపిన
## చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి అక్టోబర్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ ప్రజలకు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి దివ్య కాంతుల వేళ ప్రతి ఒక్కరి జీవితాలలో సుఖసంతోషాలు,సిరి సంపదలు వెల్లివిరియాలని ఆమె కాంక్షంచారు. కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలకు రానున్న రోజులలో మరింత మంచి జరగాలని ఆమె ఆకాంక్షించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీ అనూహ్య రీతిలో అభివృద్ధి చెందుతుందని ఆమె కాంక్షించారు. అలాగే వైస్ చైర్‌పర్సన్స్‌కి, కౌన్సిలర్లకు కూటమి నాయకులకు కూడా శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన

వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ



**బుచ్చి అక్టోబర్ 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కోటి దివ్వల కాంతులు విరజిమ్మువేళ, ప్రతి ఒక్కరి ఇంట ఆనందాలు వెల్లి విరివియాలని వారు కాంక్షించారు.పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులందరు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని వారు కాక్షించారు. రైతులకు,కూటమి నాయకులకు, కార్యకర్తలకు ప్రజలకు, వవ్వేరు బ్యాంకు సభ్యులందరికి ప్రత్యే ఒక్కరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## దీపావళి శుభాకాంక్షలు
## జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 19, ప్రభాత వార్త :** ఈ దీపావళి ప్రతి ఇంటా సుఖ సంతోషాల, ఆనందమయు దీపాలు వెలిగించాలని. జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో దీపావళి జరుపుకోవడంతో పాటు తగిన జాగ్రత్త చర్యలతో మతాబులు తదితర బాణసంచా కాలుస్తూ దీపావళి జరుపుకోవాలని ఆశిస్తూ జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీ రంగనాథుని కళ్యాణోత్సవం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రభాత వార్త :** నెల్లూరులోని తల్పగిరి శ్రీరంగనాథుని కళ్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూలపేటలోని శ్రీరంగ నాయక స్వామి ఆలయ ప్రాంగణం పెన్నార్ తీరానికి సమీపంలో ఉన్న ఆడిటోరియంలో హైదరాబాద్‌కు చెందిన సనాతన ధర్మ వారధి ఆధ్వర్యంలో ఈ కార్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ కళ్యాణత్తంతోని ఎంతో అందంగా నిర్వహించారు అనంతరం సనాతన ధర్మ వారధి నిర్వాణకర్త కల్వకుంట్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సనాతన ధర్మం సంధ్యావందనం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కల్యాణోత్సవం ఆశాంతం భక్తులు చూపరులు ఎన్ని నిమగ్నమై కళ్యాణోత్సవాన్ని తిలకించారు. కోఆర్డినేటర్ రాధాకృష్ణ పలువురు సనాతన ధర్మ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. 300 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ముందర పొట్టెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం, అన్నగారిపాలెంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీశ్రీశ్రీ ముందర పొట్టెమ్మ తల్లి, దేవతా సహిత శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమం ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా ఆదివారం కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది.ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ ముందర పొట్టెమ్మ తల్లిని,శ్రీ గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. కావలి నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషంగా, అష్టైశ్వర్యాలతో ఉండాలని అమ్మవార్లను ఎమ్మెల్యే దగుమాటి కోరారు.ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దగుమాటిని దుశ్శాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు,భక్తులు భారీగా పాల్గొన్నారు.

## గ్రామ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు



**కోవూరు, అక్టోబరు 19 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న గ్రామ దేవత శ్రీ నాగవరపమ్మ దేవస్థానంలో ఆదివారం చతుర్థశి పర్వదినం సందర్భంగా మాజీ ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధా కృష్ణారెడ్డి కుమారుడు రాజేష్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్ స్వామి, జగదీష్ స్వామి, భక్తులు ఉన్నారు.

## సంతాపం

**బిట్రగుంట అక్టోబర్ 19 ప్రభాతవార్త:** దగదర్తి మండలం సీనియర్ నాయుకులు, మాలేపాటి రవీంద్ర నాయుడు కుమారుడు, మండలం తెలుగుదేశం పార్టీ యువనాయకుడు మాలేపాటి భానుచందర్ అకాల మరణం మమ్ములను తీవ్ర దిగ్భ్రాంతికి గురించేసిందని మండల వైసీపీ కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు పేర్కొన్నారు. వారి మరణం వారి కుటుంబానికి అలాగే దగదర్తి మండల ప్రజానీకానికి తీరని లోటు, ఏది ఏమయినా ఈ విపత్కర పరిస్థితులలో ఆ సర్వేశ్వరుడు వారి కుటుంబ సభ్యులకు మనో దయర్యాన్ని కల్పించాలని అలాగే బానుచందర్ గారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ సర్వేసురుణ్ణి కోరుకుంటునమన్నారు. భానుచందర్ లాంటి యువ నాయకుడు మరణించడం దగదర్తి మండలానికి తీరనిలోటన్నారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



**దగదర్తి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతమైన అల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం ఉదయం టూ వీలర్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగమూరు గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్(35) అనే వ్యక్తి నెల్లూరు నుండి మంగమూరు వెళ్తుండగా అల్లూరు రోడ్డు రైల్వే బ్రిడ్జి వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై ఎస్సై జంపని కుమార్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీరు విడుదల



**అనంతసాగరం ,అక్టోబరు19,ప్రభాతవార్త :**మండలంలోని సోమశిల జలాశయం రెండు క్రస్ట్ గేట్ల ను ఆదివారం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో జలాశయం అధికారులు 8,9 క్రస్ట్ గేట్లను ఎత్తి 32,750 క్యూసెక్కుల వంతున వరదనీటిని విడుదల చేశారు. ఎన్ఎఫ్‌సికి 50, ఎస్‌కెఎఫ్ఎఫ్‌సికి 2200క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. 12500క్యూసెక్కుల వంతున వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 73.46టిఎంసిల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం అధికారులు తెలిపారు.

## అనుమతి లేకుండా బాణాసంచా విక్రయించరాదు : తహసిల్దార్



**మర్రిపాడు ,అక్టోబరు19,ప్రభాతవార్త :** దీపావళి పండుగను సురక్షితంగా ,పర్యావరణ రహితంగా జరుపుకోవాలని మర్రిపాడు తహసిల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే టపాకాయలు వినియోగించరాదని హెచ్చరించారు. దుకాణాదారులు టపాకాయలు అమ్మే ముందు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. టపాకాయల దుకాణాలను గ్రామాల బయట బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని, ప్రతి దుకాణానికి దుకాణానికి మధ్య కనీసం 10అడుగుల దూరం ఉండేలా చూడాలన్నారు. అక్టోబరు 18నుండి 20వతేదీ వరకు మాత్రమే టపాకాయలు విక్రయించాలన్నారు. నియమాలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని తహసిల్దార్ హెచ్చరించారు.

## ఆత్మకూరు ఆసుపత్రి పై విషప్రచారం నమ్మవద్దు



**ఆత్మకూరు,అక్టోబరు19,ప్రభాతవార్త :** ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సమస్యతో రోగులు ఇబ్బందులు పడ్డారని వచ్చిన వార్తకు రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పంది ంచారు. ఆదివారం మంత్రి ఆదేశాలతో ఆత్మకూరు రెవెన్యూ డివిజ నల్ అధికారిణి భూమిరెడ్డి పావని,డియస్పీ కె.వేణుగోపాల్, కూటమి నాయ కులు ఆసుపత్రిని పరిశీలించారు. శనివారం రాత్రి విద్యుత్ సమస్య తలెత్తిందంటూ రోగులు చంటి బిడ్డలు చాలా ఇబ్బందులు పడ్డారనే వార్త మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి వెళ్ళడంతో స్పందించిన ఆయన ఇటు అధికార యంత్రాంగాన్ని, అటు కూటమి నాయకులను పరుగులు పెట్టించారు. ఆదివారం అధికారులు, ప్రజా ప్రతినిధులు , నాయకులు జిల్లా ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. జనరేటర్ పనితీరును స్వయంగా సిబ్బందిచే ఆన్‌చేసి పరిశీలించారు. అనంతరం హాస్పిటల్ లోని వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. కేవలం 10నిముషాలు మాత్రమే విద్యుత్ ఆగిందని తమకే సమస్య రాలేదని రోగులు తెలిపారు.ఈసందర్భంగా ఇన్‌చార్జ్ సూపర్నెంట్ మునికృష్ణ మాట్లాడుతూ విద్యుత్‌లో వోల్టేజ్ వలన సమస్య తలెత్తిందని పది నిముషాల్లోనే జనరేటర్ స్టార్ట్ చేశారని ఎలాంటి సమస్య లేదన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు చంద్రారెడ్డి మాట్లాడుతూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచన మేరకు ఆసుపత్రిని పరిశీలించామన్నారు. కుడుముల సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఆనం రామనారాయణరెడ్డి ఆసుపత్రిని ఏర్పాటు చేశారని , ప్రస్తుతం దీన్ని 150పడకలకు విస్తరించేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రోగులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎప్పటికప్పుడు ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ గంగాధర్, స్థానిక అధికారులు, టిడిపి నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, బిజెపి టౌన్ అధ్యక్షులు నున్నా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు



**మర్రిపాడు,అక్టోబరు19,ప్రభాతవార్త :** దీపావళి సందర్భంగా టపాకాయలు అమ్మే దుకాణాదారులు తప్పనిసరిగా లైసెన్సులు పొంది ఉండాలని అలా కాక నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసరావ్ దుకాణాదారులను హెచ్చరించారు. అనంతరం మర్రిపాడు మండల ప్రజలకు ఎస్ఐ ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## వర్షాలు , వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ పావని

**ఆత్మకూరు ,అక్టోబరు19,ప్రభాతవార్త :** ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పాటు సోమశిల జలాశయం నుండి భారీగా నీటిని విడుదల చేయనున్నందున డివిజన్ లో తహసిల్దారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని ఆదేశించారు. జలాశయం నుండి 24గంటల్లో 4నుండి 5లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని ప్రాజెక్ట్ డిఇ తెలిపారని, దాంతో వాగులు, వంకలు, కాలువలు పొంగి ప్రవహించే అవకాశం ఉందని , తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతఆలు జలమయం కాగలవని ఆర్‌డిఒ పేర్కొన్నారు. డివిజన్‌లోని తహసిల్దార్లు, విఆర్‌ఒలు, విఆర్ఎలు అప్రమత్తంగా తమ హెడ్‌క్వార్టర్‌లలోనే ఉం టూ ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చూడాలని ఆర్‌డిఒ సూచించారు. తహసిల్దార్లు కంట్రోల్ రూ ములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పిడుగులు పడేఅవకాశం ఉన్నందున రైతులు, పశువుల కాపర్లు పొలాలకు వెళ్ళకుండా అప్రమత్తం చేయాలని, ప్రజలు వాగులు,వంకల వైపు వెళ్ళకుండా చూడాల న్నారు. పశువులను విద్యుత్ స్థంభాలకు కట్ట వద్దన్నారు.వర్షాల వలన జ్వరాలు సోకే ప్రమాదం ఉన్నందున ఎఎన్ఎంలు మందులతో సిద్ధంగా ఉండాలని ఆర్‌డిఒ ఆదేశించారు.వర్షం కురిసే సమయాల్లో గర్భిణీలు, బాలింతలు,దీర్ఘకాలికవ్యాధిగ్రస్తులుసురక్షిత ప్రాంతాల్లోఉండేలా చూడాలన్నారు.వర్షాల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా జాగ్రత్తలు తీసుక వాల న్నారు. చెరువులు,కుంటలు ప్రమాదస్థాయి మించినీరు పొంగితే సంబంధితశాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని , అధికారులు ఈసందర్భంగా ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఆర్‌డిఒ పావని ఆదేశించారు.

## ఉదయగిరి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట చినుకు పడితే చిత్తడే

**ఉదయగిరి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోనే తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణం వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో అక్కడే నాలుగైదు కార్యాలయాలు ఆ ప్రాంగణం లోనే ఉంటాయి కాబట్టి నిత్యం ఆఫీసులకు వచ్చుపోయే వారికి ఇబ్బందికరంగా ఉంది. దీంతో ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. అధికారులు త్వరగా చర్యలు చేపట్టి అక్కడ బురద లేకుండా చూడాలని కోరారు.

## మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



**కొడవలూరు, అక్టోబర్ 19ప్రభాతవార్త:**మండల ప్రజలు దీపావళి పండుగ ప్రతి ఇంటిలో వారి కుటుంబ సభ్యులు,పిల్లలతో కలిసి అంగరంగ వైభవంగా పండుగ వేడుకలు జరుపుకోవాలని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.మండల ప్రజలకు ఈ దీపావళి వారి కుటుంబ సభ్యులకు ఆనందం, ఆరోగ్యం, సంపద దేవత ఇంటిని సందర్శించి అంతులేని ఆనందాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాం,అలాగే మండల ప్రజా ప్రతినిధులు, మండలాధికారులు,తోటి అధికారులు,శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు

## గ్రామ దేవత అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విడవలూరు, అక్టోబర్ 19 ప్రభాత వార్త : గ్రామ దేవతగా వెలసియున్న శ్రీ అంకమ్మ తల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు,కుంకుమ అర్చన చేశారు. సాయంత్రం అమ్మవారికి వివిధ రకాల అలంకరణ చేయడంతో భక్తులకు అమ్మవారు కామాక్షి రూపంలో దర్శనమి చ్చారు.అదేవిధంగా పల్లకిలో అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో పల్లకి సేవ భక్తిశ్రద్ధలతో చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొనుటకు భక్తితో పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భజన భక్తమండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు.ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆలయ సేవకులు వ్యవకరించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

**- తప్పిన పెను ప్రమాదం**



**కోవూరు, అక్టోబరు 19 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని చెరువు కట్ట ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న కొప్పోలు శేషమ్మకు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఆ మంటలు పూరిల్లుపై పడి క్షణాల్లో ఇళ్లంతా దగ్ధమైంది. ఆ సమయంలో శేషమ్మ ఇంటిలో లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లో ఉన్న ధాన్యం, వస్త్రాలు, గృహోపకరణాలు , ఇతర వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం తెలుసుకున్న చుట్టుపక్కల వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుంఅ అదుపులోకి తెచ్చారు.ఈ ప్రమాదంలో సుమారు 2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని ఫైర్ అధికారులు అంచనా వేశారు. ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు గాలికి తగులుకుని ఆ నిప్పురవ్వల కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

## నీట మునిగిన వీధులు పట్టించుకోని అధికారులు, పరిపాలకులు



**కొడవలూరు, అక్టోబర్ 19 ప్రభాతవార్త:** మండలంలోని యల్లాయపాలెం పంచాయతీ రామాపురం గ్రామంలో వీధులు నీట మునిగి ప్రజలు రాకపోకలకు అంతర్యం కలుగుతుందని ఆ గ్రామ ప్రజలు ఆరోపించారు. కొన్ని ఏళ్ల నుండి ఈ పంచాయతీలో ఉన్నా రామాపురం లో వర్షాలు వస్తే దళిత కాలనీ పరిస్థితి దారుణంగా నెలకొంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్షపు నీరు వీధులపై నిల్వ ఉండడమే తప్ప బయటకు వెళ్లే మార్గం పంచాయతీ అధికారులు చూపించకపోవడం బాధాకరమైన విషయమని వాపో యారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారు. వర్షాలు వస్తే ఒక్క నాయకుడు కూడా ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే నాయకుడే లేరన్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి నీట మునిగిన వీధులు, వర్షపు నీరు నిల్వపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి



**కందుకూరు,అక్టోబర్ 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసిలు, దళితులు, కాపులపై అధికార పార్టీ అండతోనే దాడులు జరుగుతున్నాయని బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆరోపించారు. ఆదివారం ఆయన గుడ్లూరు మండలం దారకానిపాడులో ఇటీవల హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి తక్షణ అవసరాల నిమిత్తం రూ.2 లక్షలను ఆర్థిక సాయంగా అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన. కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. అధికార మదంతో అధికార పార్టీ నాయకులు ప్రజల మాన, ప్రాణాలను హరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే లక్ష్మీనాయుడు హత్య కూడా జరిగిందని ఆరోపించారు. హత్యకు పదిరోజుల ముందు నుంచి తనకు ప్రాణ హాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పోలీస్ స్టేషన్ సిసి కెమెరా ఫుటేజ్ పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. ఈ హత్యను నీరుగార్చే కుట్ర జరుగుతోందన్నారు. దానికి పోలీసుల వైఖరి కారణం కాదని, స్థానిక టిడిపి నేతల ఒత్తిడే కారణమన్నారు. టిడిపి నేత చెప్పి మరీ హత్య చేసే స్థాయికి వచ్చాడంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో వేరే చెప్పనక్కర్లేదన్నారు. హత్య జరిగిన తరువాత దర్యాప్తు కూడా సక్రమంగా సాగలేదన్నారు. ఒకరు చనిపోయి, ఇద్దరు తీవ్ర గాయాలపాలైనా హత్య కేసు సెక్షన్లు కాకుండా, హత్యాప్రయత్నం, ప్రమాదవశాత్తు జరిగిందనే సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. ఈ ఘటనలో గాయపడి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి ఇప్పటి వరకు స్టేట్ మెంట్ ఎందుకు రికార్డు చేయలేదని ప్రశ్నించారు. హత్య జరిగి పదిహేను రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ముృతుడి కుటుంబ సభ్యులకు ఎఫ్ఐఆర్ కూడా ఇవ్వలేదన్నారు. తాను వస్తున్నానని తెలుసుకొని అర్ధగంట ముందు మృతుని భార్య వాట్సాప్ కు ఎఫ్ఐఆర్ పంపారన్నారు. చంద్రబాబు నాయుడు శాంతిభద్రతల విషయంలో పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని రామచంద్ర యాదవ్ ఆరోపించారు. **- మృతుడి కుటుంబానికి రూ. కోటి పరిహారం ఇవ్వాలి.** తిరుమలశెట్టి లక్ష్మీనాయుడుని హత్య చేసిన నిందితుడికి ఉరిశిక్ష విధించాలని రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. అలాగే అధికార పార్టీ అండతో జరిగిన హత్య కాబట్టి బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ. కోటి పరిహారం ఇవ్వాలని, బాధితుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి. పిల్లల చదువుకు అయ్యే పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలన్నారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.**- చంద్రబాబు అధికారంలోకి రావడానికి సహకరించిన సామాజిక వర్గాలపైనే దాడులా?**చంద్రబాబు అధికారంలోకి రావడానికి కారణమైన సామాజిక వర్గాలపైనే దాడులు జరుగుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయమని బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావడానికి ప్రధానపాత్ర పోషించిన జనసేన పార్టీకి ఏకపక్షంగా మద్దతు తెలిపిన కాపు సామాజిక వర్గంపై దాడులు జరుగుతున్నా ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. అధికార ఆండతో దాడులు జరుగుతున్నా పోలీసులు నిందితులకే వత్తాసు పలకడానికి అధికార అహంకారంతో కూడిన ఒత్తిళ్లే కారణమని ఎద్దేవా చేశారు. అధికార మదంతో విర్రవీగే నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

## అన్న క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమం



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:**కావలి ప్రవాస భారతీయులు, సేవా తత్పరులు, కావలి వాస్తవ్యులు.మిండి శ్రీనివాస్ గారి జన్మదినము సందర్భముగా సాయి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు పొన్నగంటి. మాధవి ఆధ్వర్యంలో ఆదివారం కావలిలోని అన్నా క్యాంటిన్ ద్వారా అన్న దానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భం గావి విధ స్వచ్ఛందసంస్థల గౌరవఅధ్యక్షులు ఎస్.కె. బాష,ఉమెన్ ఫోర్స్ అధ్యక్షురాలు సి. శారదలు మాట్లా డారు ఇటువంటి కార్యక్రమములు నిర్వహించెటప్పుడు ఆర్భాటాలు తగ్గించి వ్యయ, ప్రయాసాలతో, వృధా చేయ యకుండ, పేదలకు ఉపయోగ పడే, మంచి కార్యక్రమములు అన్న దానములు,నిరుపేదలకు, ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటల అన్నా క్యాంటిన్ ద్వారా, టిఫిన్, భోజనం సరాఫరాచేయడం, చాలా సంతోషకరమని, శ్రీనివాస్ కి అభినందనలు తెలుపు తున్నామని తెలిపారు. సాయి చారిటబుల్ ట్రస్ట్ అక్షరాలు మాధవి నిరుపేద మహిళలకు జీవనోపాధి కల్పించుటకు, ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి మనసున్న దాతల, సహాయ సహకారంతో..కుట్టు మిషన్లు ఏర్పాటు చేసి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపడం అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకట్రావు, పద్మావతి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## యువనేత అకాల మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది ఎమ్మెల్యే



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ యువనేత మాలే పాటి భానుచందర్ అకాల మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆయన లేని లోటు దగదర్తి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలియజేశారు.భాను చందర్ అకాల మరణం సందర్భంగా కావలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నివాళులు అర్పించారు అనంతరం రెండు నిముషాలు పాటు మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దగుమాటి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి యువతకు పూర్వ విద్యార్థులు స్ఫూర్తిదాయకం



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** 75 సంవత్సరాల క్రితం ఒకటవ తరగతి చదువుకొని ఇప్పటికీ సన్నిహితంగా ఉండటం గర్వకారణమని నేటి యువతకు మీరు స్ఫూర్తిదాయకమని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కొనిఆడారు. కావలి పట్టణంలోని పెట్లూరి గోపాల కిష్టయ్య వీధి బడిలో 75 సంవత్సరాల క్రితం ఒకటవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం కావలి పట్టణం రామమూర్తి పేట లోని షిరిడి సాయిబాబా మందిరం ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థులు షేక్. దస్తగిరిభాషా, టంగుటూరి శివప్రసాద్, మట్ట కొండయ్య,గాదిరాజు లక్ష్మీనరసింహారావు,ఉప్పాల శ్రీనివా సరావుల ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగుమాటి ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు.నేటి యువతకు మీరు స్ఫూర్తి అని వారిని కొనియాడారు. ఈ వయసులో మీరంతా కలవడంతో మీ ముఖాలలో ఆనందం చూస్తుంటే మేము కూడా ఇలాంటి కార్యక్రమం చేయాల నిపిస్తుంది అని తెలియజేశారు. పూర్వ విద్యార్థులు తనకు వారి కుటుంబ సభ్యులను పరిచయం చేయడమే కాకుండా వారి చిన్ననాటి స్మృతులతో వారి అనుభవాలు పంచుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలియ జేశారు. ఎమ్మెల్యే దగుమాటి పూర్వ విద్యార్థులను దృశ్యాలు వాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే దగుమాటిని దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఎమ్మెల్యే దగుమాటి ముందుగా షిరిడి సాయిబాబాను దర్శించుకొని బాబా ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 75 సంవత్సరాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయాన్ని సందర్శించాలి



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:**విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయాన్ని సందర్శించాలని కావలి శాఖ గ్రంథాలయ అధికారిణి బొమ్మల కోటేశ్వరి తెలియజేశారు. కావలి శాఖా గ్రంథాలయం నందు గ్రంథాలయాధి . కాణి బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో చదవటం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా కమ్ టు ది లైబ్రరీ ఎవ్విరి సండే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పిల్లలచేత పంచతంత్రం మరియు నీతి కథలు చదివించడం జరిగింది. వారి చేత చదివిన కథలు స్టోరీలను చెప్పించడం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడారు విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి విచ్చేసి పిల్లల కథల పుస్తకాలు, ప్రముఖ జాతీయ నాయకుల పుస్తకాలు మరియు ఇతరములైన పుస్తకాలను చదివి మంచి విజ్ఞానం పొందవలసినదిగా విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో రమణ కుమ్మర,మదన్ మరియు పాఠకులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి స్పందన హర్షణీయం



**కోవూరు, అక్టోబరు 19 ప్రభాతవార్త :** దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డీఏను విడుదల చేయడం 60 రోజుల్లో హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఆర్టీసీ ఉద్యోగుల్లో వారం రోజుల్లో పదోన్నతులపై ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షణీయం అని కోవూరు తాలూకా ఎన్జీవో కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎన్జీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రి వీరితో పాటు గ్రూప్ ఆఫ్ మంత్రులతో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన చర్చలు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోషమన్నారు. ముఖ్యంగా చైల్డ్‌కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందన్నారు. అదేవిధంగా ఉద్యోగ సంఘాలు ఎన్జీవో హోమ్‌లను గతంలో మాదిరిగానే ప్రాపర్టీ ట్యాక్స్‌ల నుంచి మినహాయించడం, చెల్లించవలసిన బకాయిలు రద్దు చేయడం కూడా అభినందనీయమన్నారు. దీపావళికి ముందే ఉద్యోగుల సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి ఆ సమావేశాన్ని సాధించిన ఏపీజేఏసీ అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డీవీ రమణకు ఉద్యోగ సంఘాల తరపున ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా ఉద్యోగస్తులతో స్నేహపూర్వకమైన వాతావరణంలో జరిపిన చర్చలకు గానూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు, మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్, చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్‌కు అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

## అంకాళ్ళమ్మ తల్లి సన్నిధిలో పొంగళ్ళు



**సీతారామపురం అక్టోబర్ 19 ప్రభాతవార్త :** దశరా ,నవరాత్రుల అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా ఆదివారం సీతారామపురం గ్రామ దేవత అంకాళ్ళమ్మ దేవస్దానం వద్ద గ్రామస్తులు ఘనంగా పొంగళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించారు.దశరా ఉత్సవాలు అంకాళమ్మ దేవస్దానం నందు 9 రోజుల పాటు ఘనంగా జరిగిన విషయం విదితమే గ్రామ దేవతకు పొంగళ్ళు పెట్టేందుకు గ్రామం నుండి మహిళలు అధిక సంఖ్యలో పాల్గోని పొంగళ్ళను పెట్టి గ్రామ దేవతను పూజించారు.

## హైర్ బస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



**కావలి కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** హైర్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరారు.కావలి డిపో హైర్ బస్సు డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం ఆదివారం కావలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు పాల్గొని మాట్లాడారు డ్రైవర్లుకు చాలా సమస్యలు ఉన్నాయని తక్కువ జీతాలు ఇచ్చి యాజమాన్యం శ్రమ దోపిడీ చేస్తుందని తెలియజేశారు.కనీస వేతనం అమలు చేయడం లేదని తక్కువ జీతాలు ఇచ్చి ఎక్కువ పనులు చేస్తున్నారని తెలియజేశారు. బోనస్, యూనిఫామ్ తో పాటు కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని ఇది చాలా అన్యాయమని తెలియజేశారు.డ్రైవర్లకు యాజమాన్యం ఒత్తిడి కూడా ఉన్నదని పని భద్రత లేదని10 నుండి15 సంవత్సరాలుగా డ్యూటీ చేస్తున్న వేతనాలు లేవని సమస్యల పరి ష్కారం కొరకు కార్మికుల ఐక్యంగా పోరాటాల ద్వారా సాధించాలని సిఐటియు యూనియన్ ఈసందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు వై కృష్ణమోహన్ విజయ మధుసూదన్ రావు తోపాటు కార్మికులు పాల్గొన్నారు.నూతన కమిటీ ఎన్నిక.గౌరవాధ్యక్షులుగా పి.పెంచలయ్యఅధ్యక్షులుగా ఎం.రమేష్ ఉపాధ్యక్షులు పి.రాజేష్ కార్యదర్శి జి. హరిప్రసాద్ జాయింట్ కార్యదర్శి కే. శ్రావణ్ కుమార్ ట్రెజరీగా ఎస్కే. ఆజాద్ తో పాటు మొత్తం 11 మంది కమిటీ సభ్యులను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## నేతలకు,ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**సీతారామపురం అక్టోబర్ 19 ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులు కాకర్ల సురేష్, జిల్లా డిసిసిబి చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సీతారామపురం మండలం ప్రజలకు,అధికారులకు కూటమి నాయకులకు, నాయకులకు,కార్యకర్తలకు దీపావళి శుభాకాంక్షలను సీతారామపురం సొసైటీ అధ్యక్షులు సోమన బోయిన రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు దీపావళి పండుగను బాణా సంచాను కాలుస్తు జరపకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రతి ఇంటి ముందు నూనె దీపాలు వెలిగించి దీపావళి వేడుకలను జరుపుకోవాలని అన్నారు. ప్రజలు దీపావళి వేడుకలను జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు.

## స్వదేశీ వస్తువులు వాడండి



**నెల్లూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త -వైద్యం** స్వదేశీ వస్తువులు వాడండి భారత ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచండి అంటూ బిజెపి నెల్లూరు బిజెపి నెల్లూరురూరల్ నియోజకవర్గ కార్యకర్తలచేనియోజకవర్గ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం బిజెపి కార్యకర్తల సమావేశం మొగళ్లపాలెం లో జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణి రాజు పాల్గొని మాట్లాడారు. దేశవ్యా ప్తంగా ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తలను మండల స్థాయి నాయకులను ఈ కార్యక్రమంలోభాగస్వామ్యం చేసేందుకు జిల్లాలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతి ఇంట స్వదేశీ వస్తువులను వాడకంపై విస్తృత ప్రచారం చేపట్టేందుకు బిజెపి కార్యకర్తలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాలు నిర్వహి స్తున్నట్లు యాకసిరి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆత్మనిర్భర భారత్ లో భాగంగా పంచ పరివర్తన్ అనే అనే కార్యక్రమాన్ని బిజెపిచేపట్టిందన్నారు.దానిలో కుటుంబం, పర్యావరణం, సామాజిక సమరసత, స్వదేశీ, పౌర విధులు అనేఐదు అంశాలతో ప్రజల్లోకి వెళతామన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలచే ప్రతిజ్ఞ కార్య క్రమాన్ని నిర్వహించామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్, బిఎంఎస్ నాయకులు మోపూరు శివాజీ, కమలా కర్,రాజయ్య మదన్మోహన్, ప్రసన్నకుమార్ హరీష్,చైతన్య,సుమన్ శివశంకర్, తేజ,శేషయ్య, లోకేష్ తది తరులు పాల్గొన్నారు.

## కురపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని కాపాడండి



**ఉదయగిరి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని శకునాలపల్లి పంచాయతీ, పులయపల్లి పంచాయతీ ప్రజలు తమ గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని కంటికి రెప్పలాగా కాపాడుకుంటూ ఇంటి స్థలాలు కోసం ఏర్పాటు చేసుకుంటున్న, పుల్లాయిపల్లి పంచాయతీలో పేదలకు పంపిణీ చేసిన భూమిని దుర్మార్గం ప్రభుత్వం కనీసం ప్రజల కు విషయం కూడా తెలపకుండా పరిశ్రమల పేరుతో భూ సేకరణ చేయడం అత్యంత శోచనీయంగా ఉంది. కనీసం ప్రజా అభిప్రాయ సేకరణ కూడా లేకుండా భూమిని కేటాయించడం దుర్మార్గం అని ఆ గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మా భూమి మాకు ముద్దు నాకు పరిశ్రమలు వద్దు అంటూ మా భావితరాల వారికి ఇంటి స్థలాల కేటాయించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా ప్రాణం పోయినా మా భూమి ఇవ్వం పరిశ్రమలు పెట్టాలి అంటే దూర ప్రాంతంలో నిర్మించబండి అంటూ డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఆదివారం కుర్రపల్లిలో రైతులతో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కాకు విజయ, సీపీఎం కార్యదర్శి కోడే రమణయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య, స్థానిక నాయకులు పి.వెంకటేశ్వర్లు, పెంచల రాజు, చెన్నకేశవులు, శ్రీనివాసులు, మహిళా నాయకురాలు ఈ.సుజాత, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## ఉదయగిరిలో ఆవులు రోడ్డుపైనే తిష్ట వేశాయి



**ఉదయగిరి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలో బస్టాండ్ సెంటర్ నందు ఆవులు నడి రోడ్డుపై తిష్ట వేశాయి. ఉదయగిరిలో ఆవులు గల వాళ్ల ఇంటికి తీసుకుపోయి భద్రపరుచుకోరు. నిత్యం ఆవులు నడిరోడ్డుపైనే సంచారం చేస్తూ ఉంటాయి. వాహనదారులను పొడుస్తూ ఉంటాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్డుపై ఉన్న ఆవులను ఆవులు గల వాళ్లకి తెలియపరిచి ప్రజలకు వాహనాలకు రాకపోకలకు అడ్డు లేకుండా చేయాలని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.

## వలేటివారిపాలెంలో కోటి సంతకాల సేకరణ



**వలేటివారిపాలెం అక్టోబరు 15 ప్రభాతవార్త :** వలేటివారిపాలెంలోని గాందినగర్‌లో ఆదివారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ మరియు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు.మండల వైసీపీ అధ్యక్షుడు అనుమోలు లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.రాష్ట్ర వైసీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ శాసనసభ్యులు కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లక్ష్మీనరసింహం తెలిపారు. ప్రజలకు మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే కలిగే నష్టాలను వివరించారు.సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు అధ్యక్షులు అనుమోలు లక్ష్మీనరసింహం, ఉపాధ్యక్షులు పొట్టేళ్ల క్రిష్టయ్య, నాగిరెడ్డి శివరామిరెడ్డి, నియోజకవర్గం పంచాయతీ రాజ్ వింగ్ అధ్యక్షులు గుత్తా గోపి, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు కట్టా హనుమంతరావు, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఇరుపని అంజయ్య,జిల్లా వాలంటరీ భాగం అధ్యక్షులు పొట్టేళ్ల అంజయ్య,ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, జిల్లా బూత్ కమిటీ కార్యవర్గం సభ్యులు దామా రమేష్, గౌడ పేరు కొండయ్య,జడ ముత్తయ్య,మన్నేపల్లి నరేష్, కొంక మాధవరావు, పేయ్యల ఆంజనేయులు, గాలం నాగేశ్వరరావు, పొట్టేళ్ల బుజ్జి ,వట్టికాళ్ల మాధవ, సన్నెబోయిన శ్రీను, మార్తాల ఓబుల్ రెడ్డి, గౌడ పేరు దాస్, గౌడ పేరు రమేష్, గౌడ పేరు యాకోబు, చెరుకూరి నరసమ్మ, పాడిబండ్ల యేసు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ జీఈఏ జిల్లా కార్యవర్గ సమావేశం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రభాతవవార్త :** నెల్లూరు నగరంలోని ఐఎంఎ హాల్ నందు జిల్లా అధ్యక్షులు బి. సుధాకరరెడ్డి అధ్యక్షతన ఏపిజిఈఎ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. లక్ష్మిపతి, రాష్ట్ర కార్యదర్శి ఎస్. చక్రవర్తి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. 2026 డైరీ, మెంబర్ షిప్ ముఖ్య అంశాలుగా ఉన్న అజెండా ప్రకారం జరిగిన ఈ సమావేశానికి అన్ని తాలూకాల అధ్యక్ష కార్యదర్శులు మరియు జిల్లా సభ్యులు హాజరయ్యారు.

**డిఏ మంజూరుపై హర్షం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం శుభపరిణామంగా భావిస్తూ ఈ పరిణామాన్ని స్వాగతిస్తున్నామని ఏపిజిఈఎ నెల్లూరు జిల్లా కార్యవర్గం పేర్కొంది. ప్రభుత్వం నుండి ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డిఏ విడుదలపై జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి సుధాకర రెడ్డి, పివిఎస్‌టి రాంప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు తదితర అన్ని వర్గాల సమస్యలను క్రోడీకరించుకుని ఒక్కొక్కటి పరిష్కరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆర్థిక బకాయిల చెల్లింపుకై "రండి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం!" కార్యక్రమం ద్వారా ఏపిజిఈఎ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలపై సానుకూల ఆలోచన చేయాలని కోరారు. ఇంకా 12వ పిఆర్‌సి ప్రకటన గురించి యావత్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ లోకం ఎదురుచూస్తున్న విషయం గుర్తు చేస్తూ ప్రభుత్వం నుండి త్వరలో సానుకూల స్పందన ఆశిస్తున్నామని తెలిపారు.

## పొంగి ప్రవహిస్తున్న నల్లవాగు - ఐదు గ్రామాల ప్రజలకు అవస్తలు



**చేజర్ల అక్టోబర్ 19 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని యనమదల గ్రామ సమీపంలోని నల్ల వాగు పొంగి ప్రవహిస్తుంది. దీంతో ఆదివారం అయిదు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. తూర్పు కంభంపాడు, యనమదుల ,కోటి తీర్థం,బిల్లుపాడు, కాకి వాయి గ్రామాలకు రాకపోకలు ఆగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మోటార్ బైకులు,కార్లతోపాటు,ట్రాక్టర్లు బస్సులు కూడా ఈ మార్గంలో నడవడం లేదు. ఈ వాగుకు రెండు వైపులా రోడ్డుపై ముళ్ళ కంచెలను అమర్చి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.వర్షాకాలంలో ప్రతి ఏటా ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా సోమశిల ప్రాజక్టు వాటర్ యదనపర్తి రిజర్వాయర్ నుండి నల్లవాగుకు నీరు వస్తుండడంతో కలువాయి మండలంలోని రెండు గ్రామాల ప్రజలు, చేజర్ల మండలంలో అయిదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లవాగుపై నీరు ప్రవహిస్తుండడంతో అత్యవసర సమయంలో ఆయా గ్రామాల ప్రజలు నెల్లూరుకు వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిదులు స్పందించి ఈ వాగుపై హై లెవల్ వంతెన నిర్మించాలని ఆయాగ్రామస్తులు కోరుతున్నారు. నల్లవాగు దగ్గర ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా రెవిన్యూ ,పోలీస్ శాఖ,ఎంపిడిఒ, వివిధ మండల అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం



**చేజర్ల అక్టోబర్ 19 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వంలో వడ్డెర్లకు క్వారీలు కాంట్రాక్టర్లు వర్కర్లు 15 రిజర్వేషన్లు కల్పిస్తు క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని చెప్పడం పై రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ బత్తల కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం చేజర్ల గ్రామంలో సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం బత్తల కృష్ణయ్య మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయంపై వడ్డెర కులస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కులాల వారికి మేలు జరిగే విధంగా సిఎం నిర్ణయం తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి పదంగా దూసుకుపోతుందని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో చేజర్ల గ్రామంలోని వడ్డెర కులస్తు పాల్గొన్నారు.

## పర్యావరణహిత దీపావళి జరుపుకోండి



**ఉదయగిరి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగను ఉదయగిరి నియోజకవర్గ ప్రజలు పూర్తిగా ఆస్వాదించేందుకు పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆకాంక్షించారు. నరకాసురుని పీడను శక్తి స్వరూపిణి అయిన సత్యభామ వధించి లోకానికి ఆనందంగా కలిగిచేసిన సందర్భంగా, నరకాసురుని పీడ వదలడంతో పాటు స్త్రీ శక్తికి ప్రతీకగా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ అని అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపాలు వెలిగించి దీపకాంతులు వెదజల్లుతూ దీపావళిపండుగ జరుపుకోవాలని, పర్యావరణ హితాన్ని దృష్టి లోఉంచుకుని ప్రతి ఒక్కరూ సంతోషకరమైన, ప్రమాదరహిత, ఆరోగ్యవంతమైన దీపావళిని జరుపుకోవాలని కోరారు.

## పరమాత్మ సన్నిధికి చేరుకునేందుకు ప్రజలు భక్తిభావంతో ముందుకు రావాల



**కోవూరు, అక్టోబరు 19 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో వెలసి ఉన్న సత్యానంద ఆశ్రమంలో ఆదివారం శివానంద గిరి మాతాజీ చెబు తున్న రామాయణ ఘట్టాలు ముగి శాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరమాత్మ సన్నిధికి చేరుకునేందుకు ప్రజలు భక్తిభా వంతో ముందుకు రావాలన్నారు. ఏది సత్యమో, ఏది అనిత్యమో తెలుసుకుని నిత్యమైన పరమాత్మను భజించాలని ఈ సందర్భంగా భక్తులకు తెలిపారు. ఏ వస్తువుపై కూడా అనురాగం పెట్టుకోవడం మంచిది కాదన్నారు. ఇంద్రియనిపుణం కలిగి మోక్షాలను సాధించాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరి తీర్థ స్వామి మాట్లాడుతూ గత వారం రోజులుగా శ్రీ మాత శివానందగిరి మాతాజీ చెప్పిన వాటిని అవగాహన చేసుకుని వాటిని క్రమం తప్పకుండా ఆచరించాలని బోధించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఆస్థాన పండితులు డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, అవధాని కోట రాజశేఖర్‌రావులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాతాజీని సాంప్రదాయబద్ధంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పురుషోత్తమ తీర్థ స్వామి, శ్రీ రామతీర్థ స్వామి, ఆశ్రమ కార్యదర్శి నాగేశ్వరరావు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితురాలికి ఎమ్మెల్యే వితరణ

**- సంఘటనా స్థలానికి చేరుకున్న కూటమి నాయకులు**



**కోవూరు, అక్టోబరు 19 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని చెరువు కట్ట ప్రాంతంలో శేషమ్మ ఇల్లు దగ్ధమైందన్న సమాచారం తెలుసుకుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వెంటనే స్పందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి కూటమి నాయకులను హుటాహుటిన పంపించే ఏర్పాటు చేసి బాధితులను తమవంతుగా ఓదార్చే కార్యక్రమం చేపట్టారు. ఈ సంద ర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మల్లారెడ్డిలు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని ముందుగా బాధితురాలిని స్వాంతనపరిచి ముందుగా 20 వేలు నగదుతో పాటు, ఒక నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు బియ్యం అందజేయడం జరిగిందన్నారు. అధికారులతో మాట్లాడి శేషమ్మకు పక్కా ఇల్లు నిర్మించేలా ఎమ్మెల్యే ఆదేశాలతో చొరవ తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందుకు శేషమ్మ ఎమ్మెల్యేకు, కూటమి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సాయిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, అల్తాఫ్, ఉన్నారు.

## మారితేనే మీ బతుకులు బాగుపడతాయి



**కోవూరు, అక్టోబరు 19 ప్రభాతవార్త :** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీలుగా, కేడీలుగా రికార్డులకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని ముందుకు సాగా లని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పేర్కొ న్నారు. కోవూరులోని పోలీస్ స్టేషన్‌లో ఆది వారం ఉన్నతా ధికా రుల ఆదేశాల మేరకు రౌడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనైనా ఇటువంటి దుర అలవాట్లు మానుకుని సమాజంలో కలిసిపోవాలని వారికి హితవు చెప్పారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** దీపావళి పండుగ సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరూ గమనించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఒక డిఏను విడుదల చేయడంపై ఏపీ ఎన్జీవోస్, ఏపీ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా ఎన్‌జి హోం నందు ఏపీ ఎన్జీజీవోస్ సంఘం నెల్లూరు జిల్లా ఇన్చార్జ్ అధ్యక్షులు ఆంజనేయ వర్మ, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డిఏను విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్‌టీసీ ఉద్యోగుల ప్రమోషన్‌లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఏపీ ఎన్జీవోస్ మరియు ఏపీ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహ పూర్వకమైన, గౌరవప్రదమైన, హుందాతన చర్చలు దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోషదాయకమని వారు పేర్కొన్నారు.చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని రూ. 50,000 నుండి రూ. 1,00,000కి పెంచడం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమయ్యేలా చూడటం, వైద్య సేవల సీలింగ్‌ను రూ. 2 లక్షల నుండి రూ. 5 లక్షల పైబడేలా పెంచడం, అలాగే ఆరోగ్యశ్రీ విధానాన్ని ఇన్సూరెన్స్ మోడల్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని కమిటీకి ఆదేశించడం ఇవన్నీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా పెన్షనర్లలో ఆనందాన్ని కలిగించే నిర్ణయాలుగా పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు, ఎన్‌జీవో హోమ్‌లను గతంలో మాదిరిగానే ప్రాపర్టీ టాక్స్ నుంచి మినహాయించడం, అలాగే చెల్లించవలసిన బకాయిలను రద్దు చేయడం కూడా హర్షణీయమని తెలిపారు. దీపావళికి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి, ఆ సమావేశాన్ని సాధించగలిగిన ఏపీ జేఏసీ అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణకి ఉద్యోగ సంఘాల తరఫున అభినందనలు తెలిపారు. పిఆర్సి కమిటీ ఏర్పాటు విషయంలోనూ, 57వ మెమో ప్రకారం సుమారు 11,000 మంది ఉద్యోగులను ఓపిఎస్ పద్ధతిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడాన్ని కూడా జేఏసీ హర్షించింది. మిగిలిన సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గ్రామ వార్డు సచివాలయాల నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్స్, గురుకుల పాఠశాలలో ప్రభుత్వ రంగ సంస్థల వయోపరిమితి 60 నుంచి 62 పెంచడం, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత మరియు ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేయడం, మిగతా అన్ని అంశాల పరిష్కారం కోసం విద్యాసాగర్, రమణల నాయకత్వంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎన్‌జిజిఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారు పల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. పెంచలయ్య, రాజేంద్ర, కిరణ్ కుమార్, సతీష్, కృష్ణం రాజు, కృష్ణ కుమార్, నగర శాఖ సభ్యులు మధు, రాధ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువ నాయకులు మాలేపాటి భానుచందర్ ఆకస్మిక మృతి



**దగదర్తి, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** శనివారం రాత్రి దగదర్తి మండల మాజీ ఇరిగేషన్ బోర్డు డైరక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు కుమారుడు, యువ నాయకులు మాలేపాటి భానుచందర్ గుండెపోటుతో మరణించారు. తన చిన్నాన అయిన రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడికి ఆరోగ్యం సరిలేక విజయవాడ హాస్పిటల్లో చేర్పించి ఆయన వద్దనే ఉన్నాడు. అనుకోకుండా కడుపు నొప్పి రావడంతో హాస్పిటల్లో చూపించగా చిన్న ఆపరేషన్ చేయిస్తే సరిపోద్ది అని చెప్పారు. ఆపరేషన్ చేయించారు. చేసే టైంలోనే గుండె సంబంధిత ప్రాబ్లం రావడంతో చనిపోయారని వైద్య నిపుణులు చెప్పారు. అతని మరణం ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నామని చెప్తున్నారు. దగదర్తి మండలంలో ఎవరికి ఏ అవసరం అయి వెళ్లినా సహాయం చేస్తాడని, సహాయం చేసే దాంట్లో తండ్రికి మించిన చెయ్యి అని, అంత మంచి గుణం ఉన్న నాయకుడు ఇంకా పుట్టబోడని, వయసులో చిన్నవాడైనా గుణంలో గొప్పవాడని చెప్తున్నారు. పార్థివ దేహాన్ని దగదర్తిలో తమ స్వగృహానికి తీసుకొని రావడం జరిగింది. సోమవారం రోజు అంతిమయాత్ర చేస్తామని బంధువులు చెప్తున్నారు.

## నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



**నెల్లూరు రూరల్, అక్టోబర్ 19, ప్రభాత వార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పేద ప్రజలకు అండగా ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి మరొకసారి ఆశాకిరణంగా నిలిచింది. ఆదివారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 28 మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు రూ.24లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సంయుక్తంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు తమకు అందిన ప్రభుత్వ సహాయంపై సంతోషం వ్యక్తం చేస్తూ తమ కష్టసుఖాలను అర్థం చేసుకొని ముందుకొచ్చిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నిజమైన సంజీవినిలా మారింది. ఎవరు సహాయం కోసం దరఖాస్తు చేసుకున్నా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారు. పేదల పక్షాన నిలబడి ప్రభుత్వం చేస్తున్న సేవ సమాజానికి ఆదర్శం అని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతూ, రాబోయే రోజుల్లో మరింత మంది అర్హులు. ఈ నిధి ద్వారా లబ్ది పొందేలా చర్యలు కొనసాగిస్తామని కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఇలా ముఖ్యమంత్రి సహాయనిధి రూపంలో నెల్లూరు రూరల్ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం భరోసా, ఆశ, ఆత్మవిశ్వాసం కల్పిస్తుంది.

## టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు ఆకస్మిక మృతి బాధాకరం



**నెల్లూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త -వైద్యం :** టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్‌నాయుడు ఆకస్మిక మృతి దిగ్భ్రాంతికి గురి చేసిందని శాసనమండలి సభ్యులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. సుదీర్ఘ భవిష్యత్తు ఉన్న భానుచందర్ ఇలా పిన్నవయసులో తనువు చాలించడం అత్యంత బాధాకరం. మాలేపాటి భానుచందర్ మృతి తెలుగుదేశం పార్టీకే కాదు.. వ్యక్తిగతంగా నాకు తీరని లోటని అన్నారు. ప్రజలు, కార్యకర్తలు పట్ల ఆప్యాయత చూపే భానుచందర్ ఇక లేడన్న వార్త జీర్ణించుకోలేకపోతున్నాను. భానుచందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యుల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను అని అన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షనీయం



**వింజమూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలోనిఉద్యోగుల డిమాండ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందన హర్షనీయమని ఏపీ ఎన్జీవో అధ్యక్షులు వెలుగోటి మధు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగులకు ముఖ్యమంత్రి దీపావళి కానుకగా నవంబర్ నెల నుండి ఒక డీఏను విడుదల చేసేందుకు అంగీకారం తెలిపారని, అలాగే ఉద్యోగుల హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై పరిష్కారం కల్పిస్తారని హామీ ఇచ్చారన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత ముఖ్యమంత్రి మంత్రి వర్గ సమావేశాన్ని నిర్వహించి ఉద్యోగులకు పరిష్కారం కానీ సమస్యలను పరిష్కరించారు అన్నారు. చైల్డ్‌కేర్ లీవ్‌ప ముఖ్యమంత్రి స్పందించడంపై హెల్త్ కార్డు ప్యాకేజీ రేట్లు పెంచడంతో పాటు ఉద్యోగ సమస్యలను పరిష్కరించారు. ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు విద్యా సాగర్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ ఉద్యోగ సంఘాల తరుపున ప్రభుత్వంతో చర్చలు జరపడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల సాధనలో సమస్యల సాధనలో ఏపీ ఎన్జీవో తొలి అడుగు మాత్రమే వేయడం జరిగిందని త్వరలో కాంట్రాక్టు ఉద్యోగులను గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్స్ ప్రయోషన్లు గురుకుల పాఠశాలలో పని చేస్తున్న వారి వయోపరిమితి 60 నుండి 62కు పెంచడం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం కొరకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు.

## టపాసులు అమ్మితే కఠిన చర్యలు తప్పవు



**వరికుంటపాడు, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** మండలంలో ఏ దుకాణ దారుడైన అనుమతులు లేకుండా బాణసంచా అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రఘునాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని విరువూరు, నార్తు కొండాయపాలెం, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. టపాసులు ఉన్న, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం



**కావలి, అక్టోబర్ 19,ప్రభాతవార్త:** దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డిఏను విడుదల చేయడం,60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్‌టీసీ ఉద్యోగుల ప్రమోషన్‌లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఏపీ ఎన్జీవోస్ మరియు ఏపీ జేఏసీ నాయకులు ఎస్.శివకుమార్ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన, హుందాతన చర్చలు,దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం సంతోషదాయకమని పేర్కొన్నారు.చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు.హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని 50 వేల రూపాయల నుండి లక్ష రూపాయలకు పెంచడం,ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమయ్యేలా చూడటం, వైద్య సేవల సీలింగ్‌ను 2 లక్షల రూపాయల నుండి 5 లక్షల రూపాయల పైబడేలా పెంచడం, అలాగే ఆరోగ్యశ్రీ (ఈ హచ్ ఎస్) విధానాన్ని ఇన్సూరెన్స్ మోడల్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని కమిటీకి ఆదేశించడం ఇవన్నీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా పెన్షనర్లలో ఆనందాన్ని కలిగించే నిర్ణయాలుగా పేర్కొన్నారు.

## అడ్వకేట్ డాక్టర్ దారా శ్రీనివాసులుకు ఘనసత్కారం



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:**అంబేత్కరిస్ట్, దళిత నాయకుడు, భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కళాకారుల నాయకుడు , ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆంధ్ర రాష్ట్ర అధికార ప్రతినిధి అయిన డాక్టర్ దారా శ్రీనివాసులు ఎంతో పట్టుదలతో కష్టపడి చదివి న్యాయ శాస్త్రంలో పట్టాభద్రులు ఐనందున ఆదివారం సిపిఐ పార్టీ కావలి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దమ్ము దుర్గాబాబు తదితరులు దారా శ్రీనివాసులుని దృశ్యాలవాలతో పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా దమ్ము దుర్గ బాబు మాట్లాడారు న్యాయ శాస్త్రంలో డాక్టర్ దారా శ్రీనివాసులు పట్టభద్రులైనందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు.న్యాయవాది వృత్తిలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు విశ్రాంత వి.ఏ.ఓ లేటి చెన్నకేశవులు మాట్లాడారు పేద బడుగు బలహీన వర్గాలవారికీ అందుబాటులో ఉండి న్యాయం చేయాలని నూతన న్యాయవాదైన డాక్టర్ దారా శ్రీనివాసులని కోరడం జరిగినది. ఆయన న్యాయ శాస్త్రంలో పట్టభద్రులు అయినందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు.గాంధీ, ధనరాజ్ లు పాల్గొని ప్రశంసించడం జరిగింది.

## డిబిఎస్ కళాశాల నందు సిక్స్ ఏ సైడ్ హ్యాండ్ బాల్ పోటీలు



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** డి బి ఎస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఆదివారం సిక్స్ ఏ సైడ్ హ్యాండ్ హ్యాండ్ బాల్ పోటీలను పురుషులు, మహిళలకు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రెటరీ దామిశెట్టి.బాల సురేష్ బాబు,కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి.సుధీర్ నాయుడులు పాల్గొన్నారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి స్త్రీలు మరియు పురుషులు క్రీడాకారులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడారు పోటీ తత్వంతో ఆడినప్పుడే క్రీడల్లో విజయాలను సిద్ధం చేసుకోవచ్చుని స్పష్టం చేశారు. క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా, క్రీడల్లో సత్తా చాట వచ్చన్నారు. గ్రామీణ ప్రాంత యువతి యువకులు చక్కటి ప్రదర్శన ద్వారా జాతీయస్థాయికి ఎదగాలని కోరారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి గెలుపుకు నాంది కాగలదన్నారు.ఈ సిక్స్ ఏ సైడ్ హ్యాండ్ బాల్ నిర్వహించిన రాష్ట్ర కార్యదర్శి టి. సురేష్ ,ప్రెసిడెంట్ కె.బాలాజీ నిర్వహించడంలో సహకరించడం జరిగింది.టోర్నమెంట్ డెవలప్మెంట్ సెక్రెటరీ దామోదర్ రెడ్డి, కళాశాల పిడి దాసరి.శివసాగర్ కుమార్, పాల్గొని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గెలుపొందిన క్రీడాకారులకు కళాశాల మేనేజ్మెంట్ పురుషులు విభాగంలో ఫస్ట్ ప్లేస్ కర్నూల్, రెండో ప్లేస్ కడప, మూడో ప్లేస్ నంద్యాల, మహిళల విభాగంలో ఫస్ట్ ప్లేస్ కడప, రెండో ప్లేస్ నంద్యాల, మూడో ప్లేస్ నెల్లూరు విజేతలగా నిలిచిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జి రమేష్ బాబు,అనిల్, సంజయ్,కోచ్ లు,మేనేజర్లు పాల్గొన్నారు.

## కావలి ఎమ్మెల్యే చేతుల మీదుగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదివారం కావలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా 57 మంది లబ్ధిదారులకు రూ.37,22,710 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడారు ఇప్పటి వరకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద 1000 అప్లికేషన్లు అందగా, 600 మందికి రూ.6.11 కోట్ల రూపాయల సహాయం అందజేయడం జరిగిందని ఇంకా 360 చెక్కులు త్వరలో రానున్నాయని, అత్యవసర ఆపరేషన్ల కోసం 36 గంటల్లో ఎల్‌ఓసీ ద్వారా నిధులు మంజూరు అవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయలు వరకు భీమా సౌకర్యం లభించేలా ముఖ్యమంత్రి నూతన భీమా పథకం అమలు చేయబోతున్నారని వివరించారు. ఇందువల్ల పేదవారు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా డబ్బుల కోసం ఇబ్బంది పడరని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్రం గత 15 నెలలుగా సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సుస్థిర పరిపాలన దిశగా దూసుకెళ్తోందన్నారు. ఆయన నిరంతర కృషితో ఆంధ్రప్రదేశ్‌ను బంగారు రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా పునరుద్ధరించారని అన్నారు. ప్రజల భవిష్యత్తు కోసం, భావి తరాల కోసం సీఎం కష్టపడుతున్నారని కొనియాడారు. యువ నాయకుడు నారా లోకేష్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఆయన కృషితో విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ స్థాపన సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఐదేళ్ల పాటు పరిశ్రమలు మూతపడగా, పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి వెళ్లిపోయారని ఎమ్మెల్యే విమర్శించారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పరిశ్రమలు తిరిగి ఆంధ్రప్రదేశ్ వైపు వస్తున్నాయని తెలిపారు. కావలి నియోజకవర్గానికి బిపిసిఎల్ కంపెనీ రాబోతోందని, రూ.1.15 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం గర్వకారణమని ఎమ్మెల్యే అన్నారు.దామవరం ఎయిర్‌పోర్టు టెండర్లు నవంబర్ 7న ఓపెన్ అవుతాయని, ఫిబ్రవరిలో నిర్మాణం ప్రారంభమవుతుందని వెల్లడించారు. రామాయపట్నం పోర్టు పూర్తి కావస్తుందని, ఇండో సోలార్, జేఎస్‌డబ్ల్యూ, లాజిస్టిక్స్ కంపెనీలు రావడంతో కావలి పారిశ్రామిక కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని చెప్పారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గం లో పలు చెరువుల అభివృద్ధికి రూ.99 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కావలి పట్టణ డ్రైనేజ్ వ్యవస్థకు రూ.32 కోట్లు, తాగునీటి ట్యాప్ కనెక్షన్లకు రూ.43 కోట్లు కేటాయించబడ్డాయని తెలిపారు. మొత్తం కావలి పట్టణ అభివృద్ధికి దాదాపు రూ.75 కోట్లకు పైగా నిధులు సమకూరాయని ఎమ్మెల్యే వివరించారు. రాష్ట్రంలో మంచి పరిపాలన కొనసాగాలంటే ఈ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం అవసరం అన్నారు. మోడీ - చంద్రబాబు ద్వయం నాయకత్వం కొనసాగితేనే రాష్ట్రం ప్రగతి పథంలో సాగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, టిడిపి రాష్ట్ర లీగల్సెల్ ఉపాధ్యక్షులు పొట్లూరు శ్రీనివాసులు, సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో కుదేలైన పారిశ్రామిక రంగం



**కోవూరు, అక్టోబరు 19 ప్రభాతవార్త :** గతంలో టీడీపీ ప్రభుత్వం తెచ్చిన మైక్రో సాఫ్ట్ కారణంగా హైదరాబాద్ రూపురేఖలు మారితే నేడు గూగుల్ డేటా సెంటర్ వలన విశాఖ రూపురేఖలు మారనున్నాయని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పారిశ్రామిక రంగం పూర్తిగా నాశనమైందన్నారు. పాలకుల నిర్వాకం కారణంగా రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణం పూర్తిగా దెబ్బతినిందన్నారు. గతంలో టీడీపీ పాలనలో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పడానికి చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయడం, పారిశ్రామిక వేత్తలను వేధించడం వలన సగానికి పైగా పరిశ్రమలు పక్క రాష్ట్రానికి తరలిపోయాయన్నారు. పాలకుల వేధింపుల కారణంగా అమరరాజా, లూలూ, జాకీ , ఫ్రాంక్లిన్ వంటి సంస్థలు రాష్ట్రాన్ని వదిలిపోయాయన్నారు. మరలా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల చొరవతో దేశ విదేశాల్లో తిరిగి అనేక మంది పారిశ్రామిక వేత్తలను కలిసి రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ 17 నెలల పాలనలో రాష్ట్రానికి 10 లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. విశాఖపట్టణంకు ఐటీ కంపెనీ తీసుకురావడంతో పాటు అమరావతిలో క్వాంటమ్ వాలీని తీసుకువస్తున్నారని, రాయలసీమలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తుంటే అది చూసి తట్టుకోలేక ప్రతిపక్ష వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఇకనైనా వారు మనుకోవాలని హితవు చెప్పారు.

## నియోజకవర్గ ప్రజలకు దీపావళిశుభాకాంక్షలు



**ఆత్మకూరు ,అక్టోబరు19 ,ప్రభాతవార్త :** కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఆనం దంగా జరు పుకునే దీపావళి పండు గను ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు పూర్తిగా ఆస్వాదిం చేందుకు పర్యావరణ రహితంగా జరుపుకోవాలని ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరుతూ దీపావళి శుభా కాంక్షలను తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజ యానికి గుర్తుగా దీపాలు వెలిగించి దీపకాంతులువెదజల్లుతూదీపా వళి పండుగను జరుపుకోవాలని ,పర్యా వరణ సహితాన్నిదృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూసంతోషకం ్మైన, ప్రమా దరహితమైన, ఆరోగ్యవంతమైన దీపావళిని జరుపుకోవాలని కోరారు.






















## 'ఇండియాబుక్ ఆఫ్ రికార్డ్స్" ను సాధించిన "సరయుహీరో" సంస్థ



**నెల్లూరు,అక్టోబరు19 ప్రభాతవార్త– విద్య** వీడా ఎలక్ట్రిల్ స్కూరట్స్ ర్యాలీని నిర్వహించి ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌ను సరయుహీరో సంస్థ సొంతం చేసుకుంది. ఆదివారం నగరంలోని స్థానిక మినీబైపాస్‌లో గల సరయుహీరో షోరూం అధినేతలు అప్పల రాజ్‌కుమార్,అప్పల దిలీప్ ల ఆధ్వర్యంలో హీరో బైక్స్ సంస్థకు చెందిన వీడా ఎలక్ట్రికల్ బైక్స్‌తో నగరంలో భారీ ర్యాలని నిర్వహించారు. సుమారు 200కు పైగా వీడా వినియోగదారులు స్వచ్ఛందంగా ఈర్యాలీలో పాల్గొనటంతో ఇండియాబుక్ ఆఫ్స్ రికార్డ్స్ నిర్వాహకులు ఈ రికార్డును సరయు సంస్థకి అందించారు. ఈ సందర్భంగా సరయుహీరో అధినేతలు రాజ్‌కుమార్, దిలీప్‌లు మాట్లాడుతు ఇండియా బుక్ ఆఫ్‌రికార్డు ను కొల్లగోట్టాలనే ఉద్దేశ్యంతో నేడు ఆదివారం నుండి వీడా బైక్స్ తో ర్యాలీని నిర్వహించటం జరిగిందన్నారు. జోరువానలో వినియోగదారులు,బైక్ రైడర్స్ ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయడం సంతోషదాయకమని తెలిపారు. అలాగే ఇండియా బుక్ ఆఫ్ రికార్డు ను సొంతం చేసుకోవటం గర్వకారణమన్నారు. ఇందుకు సహకరించిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సరయు షోరూం ఆధ్వర్యంలో దీపావళి సందర్బంగా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించామని, వినియోగదారులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అలాగే ఉత్తమమైన సర్వీసును తమ సరయు హీరో అందించటంతో ముందు ఉందని పేర్కొన్నారు.అనంతరం ఇండియాబుక్ ఆఫ్ రికార్డును సంస్థ ప్రతినిధులు సరయుహీరో నిర్వాహకులకు అందజేశారు. కాగా మినిబైపాస్‌లోని సరయుషోరూం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ కేవిఆర్ సెంటర్ , అక్కడ నుండి ఆర్టీసీ , విఆర్‌సి గాంధీబొమ్మ సెంటర్, కనకమహల్ సెంటర్ , ఆత్మకూరు బస్టాండు సెంటర్‌ల మీదుగా తిరిగి షోరూంకు చేరుకుంది. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారికి బహుమతులతోపాటూ ప్రశంశా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.










## రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు



**నెల్లూరు, అక్టోబరు19 ప్రభాతవార్త– విద్య** నవంబరు 1నుండి 3 వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర ఆర్చరీ పోటీల్లో పాల్గొనే జిల్లా బాలబాలికల జట్ల ఎంపికలను ఆదివారం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష్య కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణుల ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో నిర్వహించారు. సబ్‌జూనియర్ ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో జి.వెంకటలోకేష్, ఎన్.శశాంక్, జి.మహిధర్, శశిధర్, మెక్షిత్ సాయి, సాత్విక్‌లు ఎంపిక కాగా బాలికల విభాగంలో దీత్యా చంద్రిక,ప్రీతి, ఆలియా, షణ్ముఖి, కౌషిక, తన్విసాయి అశ్వినిలు ఎంపికైయ్యారు. అలాగే సబ్‌జూనియర్ రికర్వ్ రౌండ్‌లో బాలుర విభాగంలో తరుణ్‌జోత్యా, రాజేష్, చరిత్, అక్షయ్ మహదేవ్, కౌషిక్ అహమద్,చరణ్ లు ఎంపిక కాగా బాలికల విభాగంలో నిష్విత ఎంపికైంది. సబ్‌జూనియర్ కాంపౌండ్‌రౌండు బాలుర విభాగంమలో టి.రమేష్ కుమార్, వికాస్, చైతన్య విష్ణులు ఎంపికైయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కావలి, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తాగేటివారిపాలెం గ్రామానికి చెందిన గోసల కోటేశ్వరరావు (56) మృతి చెందడం జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు కావలి రూరల్ మండలం, సర్వాయపాలెం పంచాయతీ, తాగేటివారిపాలెం గ్రామానికి చెందిన గోసలకోటేశ్వరరావు ఆదివారం తన బైక్ పై బంధువుల వద్దకు పెద్దపవనికి వెళుతుండగా కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామ సమీపన రోడ్డు ప్రమాదం జరిగిందని తెలియజేశారు. కోటేశ్వరరావుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని తెలియజేశారు.కావలి రూరల్ ఎస్సై బాజీ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాణసంచా దుకాణాల ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ



**నెల్లూరు క్రైమ్, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య నెల్లూరు టౌన్‌లోని విఆర్సి గ్రౌండ్, వైఎంసి గ్రౌండ్, నవాబ్ పేట పరిధిలోని మున్సిపల్ హై స్కూల్ నందు ఏర్పాటు చేస్తున్న టపాకాయల దుకాణాలను ఆదివారం పరిశీలించారు. దుకాణదారులు నియమ నిబంధనలను పాటిస్తున్నారా లేదా పరిశీలించి, అధికారులకు, నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా దుకాణాలను ఏర్పాటు చేసుకుని, అన్ని రకాల జాగ్రత్త చర్యలతో అమ్మకాలు జరపాలని సూచించారు.

## సిద్దేశ్వరస్వామి ఆలయ కార్యచరణపై సమీక్ష



**సైదాపురం, అక్టోబర్ 19, ప్రభాతవార్త** సైదాపురంలోని పంచాయతీ కార్యాలయం నందు ఆ గ్రామ సమీపంలో సిద్దలయ్య కోనలో వెలసి ఉన్న శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయం కార్యచరణపై అధ్యక్షులు దేగా రమణయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఈ నెల 27వ తేదీన మొదటి సోమవారంలో ప్రారంభమయ్యే కార్తీక మాసంలో భాగంగా జరగబోయే కార్యచరణపై పలు విషయాలు చర్చించి, టెంకాయలు స్వామివారి ప్రసాదంపై వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అబ్బూరి వేణుగోపాలరావు, సర్పంచ్ వెందోటి శారద, ఉప సర్పంచ్ బొలిగర్ల శివకుమార్, కమిటీ సభ్యులు, పూజారిలు పాల్గొన్నారు.